# లేచిపోతున్నా!

భట్టిప్రోలు విజయలక్ష్మి

డియర్ శంతనూ,

నిన్ను పేరుపెట్టి పిలుస్తున్నందుకు ఆశ్చర్యంగా వుందా? నిన్ను 'నువ్వు' అంటున్నందుకు ఇంకా ఆశ్చర్యంగా ఉందనుకొంటాను. అవునా? ఏం చెయ్యను చెప్పు. నిన్ను 'నువ్వు' అనటానికిగానీ, 'శంతనూ' అనటానికిగానీ నాకిన్నాళ్ళు పట్టింది మరి. నీకింకో విషయం తెలుసా! నిన్ను ఇంకా డియర్ అంటూ సంబోధించాను చూడు అది నాక్కూడా ఆశ్చర్యంగా ఉంది. నిన్ను డియర్ అనేంత అభిమానం ఇంకా నీపట్ల నాకు మిగిలివుండటం తమాషాగా నాకూ వింతగానే ఉంది. పాపం యింటికి రాంగానే నాకోసం వెతుక్కొని ఉంటావు. తలుపులన్నీ తెరిచిపెట్టి పోయింది. ఇల్లంతా దోచుకుపోయింది అని తిట్టుకుంటూ ఉంటావని తెలుసు.

నిజం చెప్పనా శంతనూ! నీ వస్తువులేమీ నేను దోచుకోలేదు. నేను నాతో తీసుకుపోతున్న వస్తువులన్నీ మా అమ్మా నాన్నా నా కోసం, నా కొత్త సుఖసంసారం కోసం ప్రేమగా ఆశీర్వదిస్తూ కొనిచ్చినవి. పాపం నా పెళ్ళితో వాళ్ళ బాధ్యత తీరిపోతోందన్న ఆనందంతో కొనిచ్చారని. అలాంటివి నీకు వదిలేసి రావటం ఇష్టం లేక నాతో తీసుకొచ్చేశాను శంతనూ.

చివరగా ఇన్నాళ్ళూ నీతో జీవితం పంచుకొన్న పాపానికి నీకో సలహా ఇస్తున్నాను. సలహానే సుమా. ఎందుకంటే నీకు ఆడవాళ్ళు అభిప్రాయాలను కలిగివుండటం వాటిని బైటపెట్టడమూ యిష్టం వుండదు గదా మరి నచ్చితే పాటించు. లేదా ఆడది, ఆఫ్ట్రాల్ ఆడది, చెప్పిన మాట వినాలా అని భావిస్తే పాటించకు. ఈసారి పెళ్ళి చేసుకునేటప్పుడు ఎంచి ఎంచి అక్షర గంధం లేనిదాన్ని, అనాకారిదాన్ని, ఇంతవరకూ పెద్ద మనిషి కాని దాన్నీ చూసి చేసుకో. అప్పుడు నీ ప్రాబ్లమ్స్ చాలా మటుకు అవే పరిష్కారమౌతాయి. అనాకారిదాన్ని చేసుకున్నావనుకో. నీ భార్యని చూసి ఎవడో కన్ను కొడతాడన్న భయం నీకక్కరలేదు. అహర్నిశలూ భార్యను కాపలా కాసే శ్రమ తప్పుతుంది నీకు. చదువులేని దాన్ని చేసుకున్నావనుకో. ఆ అమ్మాయి బైటకిపోయి ఎవరితోనైనా, ముఖ్యంగా మగవాళ్ళతో సుమా, స్నేహం చేస్తుందనే చింత నీకక్కరలా. పైగా ముందర్నించీ మగ స్నేహితులుండే ప్రమాదమూ లేదు. ఇంక ఇంతవరకూ పెద్ద మనిషి కానిదాన్ని చేసుకుంటే నీ పెళ్ళాం కన్యత్వం నిన్ను పెళ్ళాడకముందే పోయిందనే దిగులూ, అనుమానమూ నిన్ను వేధించవు. అవునా! కాదా? ఎందుకంటే



పెళ్ళానికి కాపలాగా కుక్కని పెట్టాలన్నా నీకు అనుమానమే నాయె. నన్ను కట్టుదిట్టాల్లో పెట్టి అనుమానాలతో క్షణక్షణం నువ్వు నరకం అనుభవించి నాకు నరకం చూపించిన పురుషోత్తమా నీకు వందనం. ఇన్నాళ్ళూ ఏ అనుమానంతో అయితే నన్ను చంపుకుతిన్నావో, నువ్వు ఛస్తూ వచ్చావో ఆ అనుమానాన్నే నిజం చేసేసి రెక్కలు విప్పి ఎగిరిపోతున్నాను. నీ భాషలో చెప్పాలంటే లేచిపోతున్నాను.

ఎదురు కట్నమిచ్చి మరీ ఇన్నాళ్ళ జైలు జీవితాన్ని కొనుక్కొన్నాను నేను. దాంపత్య జీవితంలో సుధలే కాదు వ్యధలూ వుంటాయని తెలిసి నా తెలివితేటలతో నా సంస్కారంతో, నా విజ్ఞానంతో, నా ప్రేమతో నిన్ను మార్చుకోవాలని నేను చేయని ప్రయత్నం లేదు. నా ప్రయత్నాలన్నీ పేడలో పోసిన పన్నీరయినాయి. నువ్వు మారవని బాగా తెలిసిపోయింది.

ఆడదంటే ఏమిటో, ప్రేమంటే ఏమిటో, దాంపత్యమంటే ఏమిటో, సహజీవనం అంటే ఏమిటో నీకు తెలియ చెప్పాలని ఎన్నోసార్లు విఫలప్రయత్నాలు చేసి విరమించుకుంటున్నాను. ఇంగ్లీష్ వాడికి మడి, ఎంగిలి అన్నమాటలు అర్థం అయ్యేలా చెప్పటం ఎంత కష్టమో నీకు ప్రేమ, మర్యాద అంటే చెప్పటం అంత కష్టం. ఇంక లాభం లేదని నిశ్చయించుకున్నాక ఇంకోదారిలేక ఇన్నాళ్ళ నీ అనుమానాలని నిజం చేస్తూ లేచిపోతున్నాను శంతనూ. లేచిపోతున్నాను. గుడ్‌బై.

— అలకనంద

ఎవరితో లేచిపోయానో అని పాపం ఎంత బాధపడతావో అని, అయినా పోతూ పోతూ ఎవరితో లేచిపోతున్నానో చెప్పకపోతే నాక్కడుపు నొప్పి వస్తుందనీ చెప్తున్నాను. నీ ధర్మమా అని మగవాళ్ళంటే నమ్మకం పోయేలా చేశావ్. మగవాడంటేనే అసహ్యం పుట్టేలా చేశావ్. అందుకే ఒక మగవాడి అనుమానపు పంజరం నించి బయటపడి వేరొక మగవాడి చెరకి బదిలీ కావటం యిష్టం లేక మగవాడితో మాత్రం లేచిపోవటం లేదోయ్. మరి ఎవరితో లేచిపోయిందబ్బా మరో ఆడదానితోనా? అని ఆలోచిస్తున్నావా? పప్పులో కాలేశావు. నేను నా సామాన్లతో లేచిపోతున్నాను. ఉద్యోగం కోసం లేచిపోతున్నాను. ఇంక నా ఉద్యోగమే నాకు భర్త అండా అన్నీను. అమ్మయ్య అన్నీ చెప్పేశానా, ఇప్పుడు హాయిగా ఉంది. ఇంతకీ ఏమనుకుంటున్నావు? అయ్యో నా పెళ్ళాం లేచిపోయిందే ఎలా అనుకుంటున్నావా? లేదా చూశావా నా అనుమానమే కరక్టు. ఇది లేచిపోయే జాతిదని నాకు ముందట్నించే తెలుసు అనుకుంటున్నావా? ఏది ఏమయినా నేను లేచిపోయేదాకా నన్ను నీ అనుమానంతో వేధించుకు తిన్న నీకు ఎప్పటికీ గుడ్‌బై.

జీవితంలో ఎప్పటికీ నువ్వు తారసపడాలని కోరుకోని

— అలకనంద